
# తెల్లవారితే...



శనివారం... లేచీ లేవడంతోనే రేడియోలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం వినడమంటే... ఏదో లోకాల్లో విహరించినట్లే ఉంటుంది. మనసంతా ఆహ్లాదంగా... ఏదో తెలియని ప్రశాంతత.

మా ఇంట్లో రేడియో పెట్టడమంటే పెద్ద చాదస్తం. పైపెచ్చు నేరం కూడా... దిక్కుమాలిన ఛానెళ్ల దురాక్రమణలో రేడియో ప్రాభవం కొంత తగ్గినప్పటికీ దాని ప్రత్యేకత దానిదే.

హైటెక్ జనరేషన్... మంచం దిగకుండానే రిమోట్‌తో ఛానెళ్ల గందరగోళంలో వికృత చేష్టల ముష్టి యుద్ధాల ఛానెల్స్ పెట్టుకొని రక్తం మరిగించుకొనే ప్రబుద్ధులకు సుప్రభాత శ్రావ్యత ఏం అర్థమవుతుంది?

కమలాకుచ చూచుక కుంకుమతో

నియాతారుణితాతుల నీలతనో...

రాగయుక్తంగా, లయబద్ధంగా వినబడు తోంది. అల్ప సంతోషినేమో... ఆధ్యాత్మికాను భూతిలో ఓలలాడుతున్నాను.

సెకండ్ సాటర్‌డే... సెలవు కావడంతో అర్జంట్‌గా రెండు ఇడ్లీ ముక్కలు మెక్కి, మధ్యా హ్నానికి నాలుగు మెతుకులు బాక్సులో కుక్కి ఇస్తే ఆదరాబాదరాగా పరిగెట్టే పరిస్థితి లేదు.

రిలాక్స్‌డ్‌గా పడక కుర్చీలో కూర్చొని, ఒక చేత్తో ఈనాడు పేపరు స్పోర్ట్స్ పేజీ చదువుతూ, మరొక చేత్తో మా శ్రీమతి యిచ్చిన మంచి కాఫీ గుటక గుటకలో ఆనందాన్ని ఆస్వాదిస్తు న్నాను. చెవుల సాయంతో సుప్రభాతం వింటూ మనసు పులకించిపోతోంది. అది సరే సరి.

పానకంలో పుడకలా, రసపట్టులో తర్కంలా నా శ్రీమతి రాజ్యం "ఏవండీ... ఇది విన్నారా!" అంటూ నేను వినిపించుకోనేమోనని గట్టిగా అరిచింది.వాస్తవంలోనే విహరిస్తున్నప్పటికీ మా రాజ్యం... రాజ్యంలోకి ప్రవేశించక తప్పలేదు.

తప్పులేదు... అగ్నిసాక్షిగా నా అర్ధాంగి... కష్టనష్టాల్లో, సుఖదుఃఖాల్లో అన్నిటా నా భాగ స్వామి. దాని మాటలు కూడా పంచుకోవల్సిన కనీస ధర్మం నాకుంది.

మనుగడ కోసం పోరాటం... సాగిస్తూనే ఉండాలి మృత్యువు తీరం చేరేవరకూ. ఇలా సెలవు రోజుల్లో తప్పితే ఏ భార్యకూ ఏ భర్తా దొరకడం లేదంటే అతిశయోక్తి కాదు. ఫోనుల్లో పొడి పొడి మాటలతోనే చాలావరకూ సాగిపో తోంది దంపతుల దాంపత్యం.

ఆశించిన ప్రతిస్పందన నా నుంచి రాక పోయేసరికి...

కత్తి పీట ముందేసుకొని వంకాయలు తరుగుతున్న రాజ్యం గభాలున లేచి, నిర్దాక్షిణ్యంగా రేడియో గొంతు నులిమి, విసవిసా వచ్చి నా చేతిలో పేపర్ లాక్కుంది.

దాని భావోద్రేకం చూసి ఏదో ముఖ్యమైన టాపిక్ చెప్పడానికి సిద్ధంగా ఉందని చెవులు నిక్కబొడుచుకొని వినడానికి సంసిద్ధమయి పోయాను.

"ఏవండీ... విన్నారా! ఈ చోద్యం... తల చెడి నాల్గిళ్లల్లో వంటలు చేసి వాడిని ప్రయో జకుడిని చేస్తే ఆ విశ్వనాథం...

పక్కవీధిలో తెలుగు మాస్టారుగారు మీకూ తెలుసు కదా! వాళ్ల పెద్దమ్మాయి పంకజం... లేచిపోయారుటండీ... లేచిపోయారు".

నా స్పందనతో సంబంధం లేకుండా దాని బాధ అది వెళ్లగక్కుతోంది.

"ఆ భాస్కరమ్మ గారిని చూస్తే కడుపు తరు క్కుపోతోందండి... పాపం... అభిమానం గలా విడ. మొగుడు పోయాక రెక్కలు ముక్కలు చేసు కొని కష్టమంతా తనే పడి వాడికి కష్టమంటే తెలియకుండా ఎంతో అల్లారుముద్దుగా... ఎంత గారాభంగా పెంచిందండీ".

పిదపకాలం బుద్దులు కాకపోతే వీడికిదేం పోయేకాలమండీ...

నంగనాచిలా, నోట్లో వేలు పెడితే కొరకడం రాని వాడిలా చూడడానికి ఎంత అమాయకం గా ఉంటాడండీ ఆ విశ్వనాథం... అమ్మో! నమ్మద్దు. చూసి మోసపోవద్దు. గుండెలు తీసిన బంటు.

మగాడు... వాడేం చేసినా చెల్లుతుంది... దానికైనా బుద్దీ జ్ఞానం ఉండద్దండీ...

ఆ తెలుగు మాస్టారు పార్వతీశంగారి పరి స్థితి తలచుకుంటే గుండె చెరువయిపోతోంది.

**కొవ్వలి రామకృష్ణ పరమహంస**

ఎంత సాంప్రదాయం గల మనిషి! నిప్పును కూడా నీటితో కడిగేరకం. అసలే రిటైర్ అయిపోయారు. రోగిష్ఠి భార్య, చాలీచాలని పెన్షన్... ఏవో ట్యూషన్‌లు చెప్పుకుని అయిం దనిపిస్తున్నారు. రైలు పెట్టెల్లా ఒకదానివెంట ఇంకోతి... ముగ్గురు... పెళ్లీడుకొచ్చిన ఆడ పిల్లలు.

కుటుంబ పరువు గంగలో కలిపి దాని మానాన అది వాడితో లేచి చక్కాపోయింది... మిగిలిన ఆ అమ్మాయిల పరిస్థితేంగాను?... వాళ్లనెవరు పెళ్లి చేసుకొంటారు? దాని తోబుట్టు వుల్లా పుట్టినందుకు ఆ అమ్మాయిలు ఏ ను య్యో... గొయ్యో... చూసుకొని చావాలా?

పెద్ద వయసులో ఆ పార్వతీశం గారికి,... భాస్కరమ్మగారికీ.... రాకూడని కష్టం తెచ్చి పెట్టారండి. ఏం అఘాయిత్యం చేసుకొంటారో ఏమో!

కన్నవాళ్లని ఇంతలా క్షోభకి గురి చేసేవా రిని ఊరికే వదలడండీ ఆపైవాడు.

కుటుంబ గౌరవం కుంటుపరిచి, పరువూ ప్రతిష్ఠా మంట గలిపి వాళ్లందరినీ తలదించు కొనేలా చేసే వీళ్లు బావుకునేదేంటండి?" ఊగి పోతోంది అపరకాళిలా.

దాని ఎమోషన్స్‌కి అడ్డుపడుతూ...

"ఎవరి యిష్టాలు వాళ్లవి... వాళ్లకి నచ్చిన ట్టుగా వాళ్లు చేసుకొంటారు. మధ్యలో మన కెందుకు?" అన్నాను.

"అవున్లెండి మరిచిపోయాను... ఆ విశ్వ నాథం మీ శిష్యుడే కదా"

ఈ లేచిపోవడం వెనుక మీ ప్రోద్బలం కూడా ఉండే ఉంటుంది" అయినా తప్పును సమర్థించడం కూడా తప్పే. అంతేకాదు... మనకేం సంబంధం లేదన్నట్లుగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం కూడా తప్పే.

టాపిక్... ట్రాఫిక్ నా వైపు మళ్లించింది.

ఎంకి పెళ్లి - సుబ్బి చావుకొచ్చినట్టు విశ్వ నాథంగాడి పెళ్లి గొడవ తిరిగి తిరిగి నా మీదకి వచ్చి పడింది. మా ఆవిడ వాక్ప్రవాహం పక్కిం టి శ్యామల రాకతో ఆగింది. బహుశా ఈ 'లేచిపోవడం' న్యూస్‌లో మరిన్ని వివరాలతో మా ముందుకొచ్చినట్లుంది శ్యామల. ఇటు వంటి సమాచార సేకరణ - పంపిణీ చాలా స్పీడ్‌గా ఉంటుంది. ఎంతైనా ఆడవాళ్ళ నెట్ వర్క్‌కి జోహార్లు అర్పించక తప్పదు.


బ్రతుకు జీవుడా అనుకుంటూ భార్యామ ణిని తప్పించుకొని బాత్రూంలో దూరాను.

టిఫిన్ల కార్యక్రమం పూర్తయింది. ఆకస్మా త్తుగా మూసివేయబడ్డ న్యూస్ పేపర్ తిరగే యసాగాను. తనకిష్టమైన టీవీ సీరియల్ పద్మ వ్యూహంలో ప్రవేశించింది శ్రీమతి. అందుకే నేమో 'లేచిపోవడం'కి అంతరాయమొచ్చింది.

సెలవు రోజు పెళ్లాం - పిల్లలతో సుఖంగా బతికేస్తామేమోనని అధికారులకు బెంగ. హైద రాబాద్ అర్జంట్‌గా వెళ్లాలని, బ్యాక్‌డోర్‌లో బ్లాక్ మనీ యిచ్చి, హాలీడేస్‌ల్లోనే పూర్తి చేయాలని, అందుకు నేనే సమర్థుడననీ పని ఫోన్‌లోనే పురమాయించాడు మా బాసు చుంచు మొఖం రాజాలింగం.

రెండు జతల బట్టలు బ్యాగులో సర్దుకొని అప్పటికప్పుడు హైదరాబాద్ బయల్దేరాను. బస్సు దొరికింది. పగటి వేళేమో జనం పలచ గానే ఉన్నారు. ఎండ ఎక్కువగా ఉంది. కిటికీ పక్కసీటులో కూర్చున్నాను. బస్సు కుదుపుల్లో ఏవైనా పుస్తకాలు చదవాలంటే కష్టమే. కళ్లు లాగేస్తాయి.

నా ఆలోచనలన్నీ 'లేచిపోవడం'పైకి మళ్లాయి. లేచిపోవడం అంటే ఏమిటి? ఆ విష




యంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకుంటాయి. రకరకాలుగా నాలో నేను తర్కించుకొన్నాక కొన్ని విషయాలు అవగతమయ్యాయి.

"అంతరాలు వేరయినపుడు - వేర్వేరు కులాల, వేర్వేరు మతాల, వేర్వేరు స్థాయిల యువతీ యువకులు పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా ఇష్టపడి ప్రేమించి పెళ్లి చేసుకుంటే దానిని లేచిపోవడం" అంటారు అనే కన్‌క్లూజన్ కొచ్చి - ఇంతకీ ఈ 'లేచిపోవడం' వ్యవహారాలు సమర్ధనీయమా - కాదా? దీని వలన దుష్ప్రభావాలు సమాజంపై ఏమిటి? ఎందుకు అందరికీ లేచిపోవడంపై ప్రత్యేక ఆసక్తి, కుతూహలం? ఈ కోణాల్లో ఆలోచించసాగాను.

వయసొచ్చిన యువతీ యువకులు లేచిపోతే, తద్వారా దాని తాలూకు దుష్ఫలితాల, దుష్ప్రభావం యువతపై పడుతుందనుకుంటే, ప్రభుత్వం దానిని సామాజిక నేరంగా పరిగణించి శిక్షాస్మృతిలో ఒక చట్టం తీసుకొచ్చేది కదా!

ఒకవేళ చట్టం దృష్టికి ఈ లేచిపోవడం సమస్య వచ్చి ఉండకపోవచ్చు. కానీ మతఛాందసులు, మతపెద్దలు కూడా ఏ మతంలోనూ లేచిపోవడాన్ని గర్హిస్తూ, నిషేధిస్తూ ఏ రకమైన తీర్మానాలూ చేసినట్లు కనబడట్లేదు.

పోనీ సంఘసంస్కర్తలు దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తారా అని చూస్తే వాళ్లు ఇలా లేచిపోయి వచ్చిన యువతీ యువకులకు చేయూతనిచ్చి ఆర్య సమాజాల్లో పెళ్లిళ్లు చేయడం మనం చూస్తూనే ఉన్నాం.

పోలీస్ స్టేషన్లలో కూడా లేచిపోయి వచ్చి, వారి రక్షణ కోరితే వారి సమక్షంలోనే పెళ్లిళ్ళు చేసిన సంఘటనలు మనం ఎన్నో విన్నాం.

'మ్యారేజి రిజిస్ట్రేషన్ ఏక్ట్'లో కూడా ఎక్కడా లేచిపోవడంపై ప్రస్తావన కనబడదు.

ఇంకో కోణంలో ఆలోచిస్తే...

శ్రీకృష్ణుడు రుక్మిణిని లేవదీసుకుపోతే ఆ శ్రీకృష్ణపరమాత్ముడిని ఆరాధ్య దైవంగా కొలిచి 'రుక్మిణీ కళ్యాణం' కథలు కథలుగా చెప్పుకోవడం లేదా?

పాతాళభైరవి సినిమాలో తోటరాముడు – కోటలో రాణిని గుర్రంపై లేవదీసుకుపోతే ఎంత మంది ఆనందించలేదు?... ఎన్నిసార్లు జనం ఆ సినిమాని వెర్రిగా చూడలేదు?

మొన్నటికి మొన్న వచ్చిన తొలిప్రేమ సినిమాలో తన ఫ్రెండ్ ఓ అమ్మాయిని లేవదీసుకువస్తే అండగా నిలబడి పవన్ కళ్యాణ్ ఫైటింగ్ చేసి పెళ్లి జరిపించడం అతనికి స్టార్‌డమ్ తీసుకురాలేదా?

ఇలా ఆలోచిస్తూ పోతే సమర్థనీయాంశాలు చాలానే కనబడ్డాయి. అయితే మరో కోణంలో...

ఎన్నో ఆశలతో... ఎన్నో ప్రయాసల కోర్చి కష్టపడి పెంచిన తల్లిదండ్రుల మనోభావాలను దెబ్బతీసి వాళ్ల అభిమతానికి వ్యతిరేకంగా వారిని ఎదిరించి లేచిపోవడం కాస్త బాధాకరమే.

వ్యవస్థలో... కొంతమంది వ్యక్తుల అవగాహనా లోపం వలన, కొంతమందికి జరిగిన చేదు అనుభవాల మూలంగానో, కొంతమంది ఇతరుల్లో తప్పులను భూతద్దంలో చూసి, వాళ్లను ఊరికే అల్లరిపాలు చేస్తారు. అలాంటి మనోవికార ప్రవృత్తి వాళ్ల వలనో, తిన్నది అరగక తీరుబడిగా కారు కూతలు కూసే కాకుల కేకల మూలంగానో... ఇలాంటి 'లేచిపోయారు' వంటి భావాలకు పునాదులు ఏర్పడి, వాటి మీద అందమైన భవనాలు కూడా ఏర్పడిపోతాయి. అలాంటి భవనాలకు అందరూ తలోమాటా వేసి మరికాస్త కళాత్మకంగా తీర్చిదిద్దుతారు.

విశ్వనాథ్... చాలా ఏళ్ల నుంచి నాకు పరిచయం. నాపై గురుభావం అతనికి. కష్టసుఖాలు బాగా తెలిసిన వ్యక్తి, పెద్దలంటే గౌరవం. ఎదుటి వ్యక్తుల కోణంలో ఆలోచిస్తూ... వారి ఆనందంలో తను జీవించేస్తూంటాడు.

ఆత్మ విశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగి, బాగా పేరు కలిగిన బ్యాంకుకి బ్రాంచ్ మేనేజర్‌గా చిన్న వయసులోనే అందుకోగలిగాడు. స్వాభిమానం గల కుర్రోడు.

ఏ పరిస్థితుల్లో ఆ పని చేసి పనిలేని పనికిమాలిన జనం నోట్లో నానుతున్నాడో? కలిసినప్పుడు ఖచ్చితంగా చెప్పితీరుతాడు.

నమ్మిన బంటులా మా బాసు రాజలింగం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెప్పిన పని పూర్తి చేసి, వెనక్కి బయల్దేరాను.

ఇంట్లో అడుగు పెట్టగానే...

"ఏవండీ... వెళ్లిన పని పూర్తయిందా? మా వాళ్లను కలిసారా? ఎలా ఉన్నారు" ప్రశ్నల వర్షం జోరుగా కురిపించింది శ్రీమతి.

"ఏం చెప్పమంటావే...? నా నోటితో ఎలా చెప్పగలను? మీ తమ్ముడూ – మరదలూ 'లేచిపోయారు'ట" కొంచెం డ్రమెటిక్‌గా చెప్పాను.

"ఏం తొక్కి వచ్చారు? మీకేమైనా అయ్యిందా ఏంటి?"

"మాఘ మాసంలోనే కదా మా తమ్ముడి పెళ్లి ఘనంగా జరిగింది? నాకు ఆడపడుచు లాంఛనాలు ఘనంగా ముట్టాయి. మీకూ ఏం తక్కువ చేయలేదు కదా మావాళ్లు? ఏకైక అల్లుడని ఖరీదైన రేమండ్స్ జత పెట్టారు" హెచ్చు స్వరంతో ఉడుకుమోతుతనంతో చెప్పింది నా ముద్దుల రాజ్యం.

"నన్ను కూడా కాస్త మాట్లాడనీయవే, ఒక్క మాటలో చెప్పాలంటే... మీ అమ్మా నాన్నల ముసలి కంపు వాళ్లకి గిట్టలేదు.

హైదరాబాదులో ఉంటున్న ఫ్లాటుని అయినకాడికి అమ్మేసి, మీ అమ్మా నాన్నలను ఓల్డేజి హోమ్‌లో చేర్చే ఫార్మాలిటీస్ పూర్తి చేసి, వాళ్ల మానాన వాళ్ళు 'బెంగుళూరు' లేచిపోయారు.

మనకి కనీసం ఒక మాటకూడా చెప్పలేదు. చూసావా! ఈ నెలాఖరుకి ఫ్లాటు ఖాళీ చేయాలిట... నువ్వంటూ ఉంటావే... దైన్యస్థితిలో వాళ్లని చూస్తే కడుపు తరుక్కుపోయింది. గుండె చెరువయిపోయింది... నిన్ను కష్టపెట్టడానికి చెప్పడం లేదే. స్వార్థంతో కళ్లు బైర్లు కమ్మి, కన్నవాళ్లని ఇంతటి క్షోభకి గురిచేసే వాళ్లని ఆ .పై వాడొకడుంటే ఊరికే వదిలిపెట్టడు... చెబుతూనే ఉన్నాను.

కరెంట్ షాక్ కొట్టిన దానిలా నమ్మలేని, జీర్ణించుకోలేని నిజం వింటూంటే రకరకాల ఉద్వేగాలు చుట్టుముడుతూంటే నిశ్చేష్టురాలయి నాకేసి చూస్తోంది.

నమస్కారమండీ మాస్టారూ... విశ్వనాధ్, పంకజం లోపలికి వచ్చారు.

రండి... రండి... అంటూ లోపలికి ఆహ్వానించాను. మా ఆవిడ షాక్‌లోంచి తేరుకోలేక తేరుకొని ఎట్టకేలకు బయటపడి నవ్వు పులుముకొని నవ్వింది మర్యాదపూర్వకంగా.

మాస్టారూ... మేమిద్దరం అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకొన్నాం" మీరు కూడా దీవించండి... అంటూ అక్షింతలు మాచేతికిచ్చి మా ఇద్దరి కాళ్లకూ నమస్కారాలు చేసారు. మనస్ఫూర్తిగా దీవించాను.

మేమిద్దరం ఒకరినొకరం ఇష్టపడ్డాం. మా అమ్మగారికి, వాళ్ల పేరెంట్స్‌కీ కూడా మా పెళ్లి ఇష్టమే. అయితే పెళ్లి పేరు చెప్పి అప్పులు చేసి లక్షలు ఖర్చు పెట్టించడం నాకిష్టం లేదు. అందుకే సింపుల్‌గా ఇలా కానిచ్చేసాం నవ్వుతూ చెప్పాడు.

అంతేకాదు... ఇంకో శుభవార్త. బ్యాంకు లోన్ తీసుకొని మన వీధి చివర పంతులుగారి రెండు పోర్షన్ల ఇల్లు కొన్నాను. మా అమ్మగారు, పంకజం వాళ్ల అమ్మానాన్నలు... అందరం కలిసి అక్కడే ఉండాలని నా అభిమతం. అందరం కలిసి ఉంటేనే కదండీ అసలైన ఆనందం" అని చెబుతూ వచ్చే సోమవారం పాలుపొంగిస్తాం... తప్పకుండా రావాలి మీరు అని "పంకజం... ప్రసాదం యివ్వు" అన్నాడు.

ప్రసాదం యిచ్చి వెళ్తొస్తాం సార్! అని బయల్దేరారు.

ఇంకోసారి దెబ్బతింది మా రాజ్యం... దాని అహం. బిక్కమొహం వేసుకొని "ఏవండీ... మా అమ్మానాన్నలు..." కళ్లనీళ్లు పెట్టుకొంది.

దానిని అలా చూస్తే జాలేసింది... "పిచ్చి మొహమా! వాళ్లని నీవాళ్లు అలా వదిలేస్తే, మనం వదిలేస్తామా ఏంటి? వాళ్ల సామాన్లు ట్రాన్స్‌పోర్ట్‌కి బుక్ చేసి, గౌతమీకి టిక్కెట్లు రిజర్వు చేయించి యిచ్చి వచ్చాను. రేపీపాటికి మనింట్లో మనతో పాటే వాళ్లు..." కళ్లల్లో అవే నీళ్లు తళుక్కుమనడం చూసి స్థిమితపడ్డాను.

పక్కన కూర్చొని "ఏమే రాజ్యం... ఒక మాట చెప్పవే... మన పిల్లలు ఒకవేళ లేచిపోతే ఏం చేద్దాం?" అన్నాను.

విశ్వనాథం - పంకజంలా లేచిపోతే నాకేమీ అభ్యంతరం లేదు. మా తమ్ముడు - మరదలూలా లేచిపోతే మాత్రం చీల్చి చెండాడేస్తాను వెధవల్ని అంది అభినయిస్తూ.

సరే! మనం 'లేచిపోదామా'? అన్నాను ఆటపట్టిస్తూ. కళ్లెర్ర చేసి గుర్రుగా చూసింది.

ఛ... ఈ మూడ్‌లోంచి 'లేచి' అలా బయటకు 'పోదామా' అంటున్నాను... అన్నాను.

"లేచిపోదాం... రా!" అంటూ కనుసైగ చేసి పక్కున నవ్వింది... దాని నవ్వుతో నేను కూడా శృతి కలిపాను. ●